సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 30 । మే । 2025



చెరువు శిఖం భూమి కబ్జా

సారంగాపూర్ శివారులో చెరువు శిఖం భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ఇటీవల వెలుగు చూసింది.

- 8లో ▸



రైస్‌మిల్లుల్లో కలెక్టర్..

అర్సపల్లి, ఖానాపూర్, సారంగాపూర్ ప్రాంతాల్లోని రైస్‌మిల్లులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /24.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

రికవరీ ఎందుకు చేయలేదు?

- సీఎంఆర్ రాబట్టడంలో చర్యలు తీసుకోలేదెందుకు?
- నోటీసులు ఇస్తే రికవరీ అయినట్లేనా?
- కేసుల మీద కేసులు పెట్టండి.. మిల్లులను వేలం వేయండి
- యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ఆరునెలల్లో రికవరీ చేయాలి
- ఇదేమీ అసాధ్యమైన టాస్క్ కాదు
- ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు
- యాసంగి ధాన్యం సేకరణపై అధికారులకు అభినందనలు

ఉమ్మడి జిల్లాలో డిఫాల్ట్ రైస్‌మిల్లర్ల నుంచి సీఎంఆర్ రికవరీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు? పది సంవత్సరాల్లో ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చారు? నోటీసులు ఇస్తే పని అయిపోయినట్లా? వారానికి ఒక నోటీసు ఇస్తే పదేళ్లలో ఎన్ని నోటీసులు ఇచ్చారు? ఇలా చేస్తే రికవరీ అయినట్లేనా? గత సమీక్ష సమావేశంలోనూ ఇవే లెక్కలు చెప్పి మళ్లీ మార్పు లేకుండా అవే లెక్కలు చెప్పడమేమిటి?.. ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను అడిగిన ప్రశ్నలివి.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, మదన్‌మోహన్, భూపతిరెడ్డి, కలెక్టర్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం, భూభారతి, వానాకాలం సాగు ప్రణాళిక అంశాలపై రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష చేశారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి ధాన్యం సేకరణపై అధికార యంత్రాంగాన్ని అభినందించారు. అయితే జిల్లాలో డిఫాల్ట్ మిల్లర్లు ఎంతమంది ఉన్నారని మంత్రి జూపల్లి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును అడిగారు. 44 మంది డిఫాల్ట్ మిల్లర్ల నుంచి రూ.250 కోట్ల మేర సీఎంఆర్ రావాల్సి ఉందని కలెక్టర్ చెప్పారు. 2014–15 నుంచి 2022–23 వరకు ఇవ్వాల్సిన సీఎంఆర్‌పై చర్యలేమి తీసుకున్నారని మంత్రి ప్రశ్నించారు. ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రూ.2.5 కోట్ల మేర రికవరీ చేసినట్లు కలెక్టర్ తెలపగా, గత సమీక్షలోనూ ఇవే లెక్కలు చెప్పారని, రికవరీ ఎందుకు చేయలేదని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. నోటీసులిచ్చినట్లు కలెక్టర్ చెప్పగా, పదేళ్లలో ఎన్ని నోటీసులు ఇచ్చారని, నోటీసులిస్తే పని అయినట్లేనా అని మంత్రి అన్నారు. తక్షణమే కేసుల మీద కేసులు పెట్టి అందుకనుగుణంగా షెడ్యూల్, యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని 6 నెలల్లో రికవరీ చేయాలని జూపల్లి ఆదేశించారు. ఇదేమీ అసాధ్యమైన టాస్క్ కాదని, అవసరమైతే మిల్లులను వేలం వేసి రికవరీ చేయాలన్నారు. వచ్చే వారంలో అధికారులందరూ అడ్వొకేట్ జనరల్‌తో కలిసి పూర్తి వివరాలతో హైదరాబాద్‌లో సమీక్షకు రావాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే రూ.10 లక్షలు ఖర్చు అయినా సరే ప్రత్యేక న్యాయవాదిని పెట్టుకుని ముందుకెళదామన్నారు. ప్రతి మిల్లువారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని రావాలన్నారు. అదనపు కలెక్టర్‌దే రికవరీ బాధ్యత అన్నారు. కామారెడ్డి జిల్లాలోనూ 49 మంది డిఫాల్ట్ మిల్లర్ల నుంచి రూ.45 కోట్లు రికవరీ కావాల్సి ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కేవలం రూ.4.4 కోట్లు మాత్రమే రికవరీ చేయడమేమిటని, మిగిలిన మొత్తం రికవరీ కోసం చర్యలు తీసుకోవాలని జూపల్లి ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రతి 15 రోజులకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ఫలితం సాధించాలన్నారు.

■ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు లక్ష్యంగా పెట్టుకుని 752 ఇళ్లు మాత్రమే మంజూరు చేసినప్పటికీ.. ఒక్క ఇల్లు నిర్మాణం మాత్రమే ప్రారంభించడంపై మంత్రి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇళ్ల గ్రౌండింగ్ స్పీడ్ పెంచాలన్నారు.

80 శాతంపైగా సన్నధాన్యం సేకరణ

నిజామాబాద్ జిల్లాలో యాసంగిలో 4.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రికి వివరించారు. కాగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకుని లక్ష్యానికి మించి ఇప్పటివరకు 8.21 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలిపారు. ఇందులో 80 శాతానికి పైగా 7.27 లక్షల మెట్రిక్ టన్నులు సన్నధాన్యం ఉందని తెలిపారు.

■ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులోకి తెచ్చామని మంత్రి జూపల్లి అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, నిరుద్యోగ యువతకు బాసటగా నిలువాలని మంత్రి అధికారులకు సూచించారు. భూభారతి చట్టాన్ని ఇప్పటికే పైలెట్ మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని, జూన్ 3 నుంచి అన్ని మండలాల్లో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు



నిజామాబాద్ అర్బన్ స్లమ్ ఏరియాల్లోని నిరుపేదలకు భూసేకరణ చేసి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు పరిశీలించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. రేకుల షెడ్లు, తాత్కాలిక గృహాల్లో ఉంటున్నవారిని గుర్తించి, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర రైతు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు పంచాలి..



నిజామాబాద్ నగరంలో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఎవరికీ పంచలేదని, అవి పాడయ్యాయని, మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ మంత్రిని కోరారు. మరమ్మతులు చేసి పేదలకు పంచాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టైంబౌండింగ్ పెట్టుకుని నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. టీఐఎఫ్ యూడీసీ కింద ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు పలు అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసి, నిజామాబాద్ అర్బన్‌కు కేవలం 752 ఇళ్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఇందులో కేవలం ఒక్క ఇల్లు మాత్రమే మొదలు పెట్టారన్నారు. మిగిలినవారికి స్థలాలు కేటాయించి ఇళ్లు ఇవ్వాలని మంత్రిని డిమాండ్ చేశారు. నాగారంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభం, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సమస్యలపై మంత్రి జూపల్లిని కోరారు.



పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు

వార్డ్ ఆఫీసర్లకు షోకాజ్ షాక్

- నిజామాబాద్ కార్పొరేషన్‌లో మొత్తం 60 మందికి నోటీసులు
- 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం
- పనులు చేసినా ఏకపక్షంగా నోటీసులు జారీ చేశారంటున్న వార్డు ఆఫీసర్లు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న 60 మంది వార్డు ఆఫీసర్లకు ఉన్నతాధికారులు ఒకేసారి షోకాజ్ నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఏశాఖలోనైనా సాధారణంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే, క్రమశిక్షణ తప్పే ఒకరిద్దరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఒకేసారి 60 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

కారణమిదేనా..?

వార్డు ఆఫీసర్లు రెవెన్యూ పనులు సైతం చేస్తున్నారు. ఆస్తి పన్ను బకాయిదారులకు డిమాండ్ నోటీసులు ఇవ్వడంతోపాటు భువన్ సర్వే, డబుల్ అసెస్‌మెంట్లు గుర్తింపు, శిథిలావస్థలోని నిర్మాణాలు, కూల్చివేసిన నిర్మాణాలు, అసెస్‌మెంట్‌లో ఉన్న నిర్మాణాలు, అసెస్‌మెంట్ లేనివాటి వివరాలు క్షేత్రస్థాయిలో సేకరించాలి. వీరిలో కొంతమంది తాము సేకరించిన వివరాలు యాప్‌లో నమోదు చేయడంలో కాస్త వెనుకబడ్డారు. మరి కొంతమంది తాము సేకరించిన వివరాలు పైస్థాయి సిబ్బందికి అందించగా వారు వివరాలు నమోదుచేయలేదు.



ఆర్‌వో అల్టిమేటం!

రెవెన్యూ ఆఫీసర్ ఖదీర్ పాషా 60 మంది వార్డు ఆఫీసర్లకు ఈనెల 27న ఒకేసారి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. 24 గంటల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. సరైన వివరణ ఇవ్వకపోతే చార్జిమెమో జారీచేస్తామని, మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో తమ సమస్యలను కమిషనర్‌తో చెప్పుకుంటామని వార్డు ఆఫీసర్లు కోరినా ఆర్‌వో అంగీకరించలేదు. ఆలస్యం చేస్తే చార్జి మెమో జారీచేస్తానని ఆర్‌వో అల్టిమేటం ఇచ్చారని వార్డు ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆవేదన పట్టేదెవరికి?

కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్లకు అన్ని పనులు అప్పగిస్తున్నారు. ప్రభుత్వ సర్వేలు, కులగణనతో పాటు పన్ను వసూళ్లలో సైతం వీరి పాత్ర కీలకమైంది. వీటితోపాటు తాజాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రాజీవ్ యువ వికాసం రుణాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన, దరఖాస్తుదారుల వివరాలు 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌లో నమోదు. తర్వాత డివిజన్‌వారీగా సర్వేచేశారు. మళ్లీ రెండోదఫా రీసర్వేలు కూడా చేశారు. ఇంత చేస్తున్నా తమ ఆవేదన ఎవరికీ పట్టడం లేదని వార్డుఆఫీసర్లు వాపోతున్నారు.

మరింత ఈజీగా రిజిస్ట్రేషన్లు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్
- జూన్ 2 నుంచి అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

సుభాష్‌నగర్: రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభం కానుంది. గంటల తరబడి కార్యాలయాల్లో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇదివరకు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించింది. ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, భీమ్‌గల్, ఎల్లారెడ్డి, దోమకొండ, బాన్సువాడ, బిచ్కుందలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇళ్లు, ప్లాట్లు వంటి ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లపై అమ్మిన, కొన్నవారితోపాటు సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. దీనికి ఎక్కువ సమయం పడుతుండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంకల్పించింది. ఇందుకోసం ఆధార్–ఈ సంతకం అమలు చేసేందుకు కూడా సిద్ధమవుతోంది. తద్వారా జాప్యం లేకుండా ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయొచ్చని భావిస్తోంది.



నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఒక్కో సబ్‌రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం ద్వారా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆర్మూర్‌లో ఈ విధానం విజయవంతమైంది. స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకు ఒక సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లుగా నిర్ణయించారు. ఉదయం 24 స్లాట్లు, మధ్యాహ్నం 24 డాక్యుమెంట్లు చేసేలా విభజించారు. రిజిస్ట్రేషన్ కోసం ముందుగా registration.telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. తద్వారా ప్రజలు కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా నిర్దేశిత సమయంలో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. ఆలస్యమైతే మాత్రం మరుసటి రోజు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఐదు డాక్యుమెంట్లను స్లాట్‌తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

సేవల్లో పారదర్శకత

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవలు వేగంగా, పారదర్శకంగా అందించాలని స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తోంది. ఇకపై 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

స్లాట్ బుకింగ్ లేకుంటే రిజిస్ట్రేషన్ చేయం

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్లాట్ బుకింగ్ విధానంతో జూన్ 2 నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలుచేస్తాం. ఆర్మూర్‌లో స్లాట్ బుకింగ్ విధానం విజయవంతంగా కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ ద్వారానే అనుమతిస్తాం. స్లాట్ బుకింగ్ లేకుండా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయబోం. ప్రజలు గమనించి సహకరించాలి. – ప్రసూన, రిజిస్ట్రార్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

కదిలిన హలాలు

పొలాన్ని దున్నడానికి ఎద్దుల అరకతో వెళ్తున్న రైతు





జీజీ నడ్కుడ వద్ద ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు



గాదేపల్లిలో పసుపు విత్తనాలను శుద్ధి చేస్తున్న మహిళలు



నూత్‌పల్లి వద్ద సేంద్రియ ఎరువు చల్లుతున్న రైతు

రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో హలాలతో అన్నదాత కదిలాడు. ఏరువాక పౌర్ణమికి ముందే సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, సోయా, పసుపు విత్తడం వంటి పనులు మొదలు పెట్టారు. యంత్రాలు, ట్రాక్టర్లు, ఎద్దుల సాయంతో వ్యవసాయభూములను దున్నుతున్నారు. సేంద్రియ ఎరువులు చల్లుతున్నారు. ఒక పక్క విత్తన శుద్ధి చేస్తూ మరో పక్క విత్తనాలను చకచకా వేస్తున్నారు. పల్లెలు వ్యవసాయ పనులతో కళకళలాడుతున్నాయి.

– డొంకేశ్వర్(ఆర్మూర్)



పసుపు విత్తనాలను మోసుకెళ్తున్న కూలీలు

న్యూస్‌రీల్

త్వరలో ఎకో టూరిజం పనులు



డొంకేశ్వర్/బాల్కొండ: జిల్లాలోని డొంకేశ్వర్, నందిపేట్, బాల్కొండ మండలాలను కలుపుతూ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో త్వరలోనే ఎకో టూరిజం పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అటవీ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫీసర్ (ఐఎఫ్‌ఎస్) సునీతాభగవత్ అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం కొంత నిధులను కూడా మంజూరు చేసిందని తెలిపారు. గురువారం ఆమె డొంకేశ్వర్ మండలం చిన్నయానం, బాల్కొండ మండలం జలాల్‌పూర్ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించారు. చిన్నయానం ప్రాంతానికి విదేశాల నుంచి వచ్చిన ఫ్లెమింగో పక్షులను అలాగే అక్కడ సంచరిస్తున్న జింకలను బైనాక్యులర్స్ ద్వారా వీక్షించారు. వాచ్ టవర్లు, రిసార్టులు ఏర్పాటు చేసే స్థలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జలాల్‌పూర్ శివారులో రైతులతో మాట్లాడారు. మాక్లూర్ మండలం చిన్నాపూర్ పార్క్‌ను సందర్శించి అక్కడే భోజనం చేశారు. ఆమె వెంట ఫారెస్ట్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ఉన్నతాధికారి రంజిత్ నాయక్, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీ శంకర్, ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ ఎఫ్ఆర్వోలు సుధాకర్, శ్రీదేవి ఉన్నారు.

డీజీపీని కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) డాక్టర్ జితేందర్‌ను సీపీ సాయి చైతన్య కామారెడ్డిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డి పోలీస్ కార్యాలయానికి వచ్చిన డీజీపీని సీపీ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అందుబాటులో ఫౌండేషన్ విత్తనం

రుద్రూర్: రుద్రూర్ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన కేంద్రంలో సోయా చిక్కుడు బాసర రకం ఫౌండేషన్ విత్తనం అందుబాటులో ఉందని పరిశోధనా స్థానం అధిపతి టి అంజయ్య తెలిపారు. ఈ రకం తెలుపు రంగు పుష్పాలు కలిగి, అధిక సంఖ్యలో కాయలను కలిగి ఉంటుందని, ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి సామర్థ్యం కలిగి ఉందన్నారు. కోత ఆలస్యమైనా కాయ చిట్లిపోవడం తక్కువగా ఉంటుందని, ఆసక్తి గల రైతులు 99896 25218, 99853 31641 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ ఏడాది నుంచే నవోదయ తరగతులు

- తాత్కాలికంగా డైట్ కళాశాల భవనంలో..
- భవనం మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరు

సుభాష్‌నగర్: జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయం తరగతులు ఈ ఏడాది (2025 – 26) నుంచే ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శాశ్వత, తాత్కాలిక స్థలాలకు సంబంధించి అవసరమైన చర్యలు ప్రారంభించాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు గురువారం లేఖ రాశారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేక చొరవతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిజామాబాద్, జగిత్యాల్ జిల్లాల్లో రెండు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని ఇటీవల నవోదయ అధికారులకు ఎంపీ లేఖ ద్వారా విన్నవించారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, నిజాంసాగర్ నవోదయ ప్రిన్సిపాల్‌కు లేఖ రాశారు. శాశ్వత భవన నిర్మాణం కోసం జిల్లా అధికారులను సమన్వయం చేసుకొని జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ శివారులో ఎలాంటి వివాదాలు లేని 30 ఎకరాల భూమిని నవోదయ విద్యాలయ సమితి పేరుపై బదలాయించుకోవాలని లేఖలో సూచించారు. నాగారం శివారులోని ప్రభుత్వ డైట్ కళాశాల భవనంలో తరగతులను ప్రారంభించనున్న నేపథ్యంలో మరమ్మతుల కోసం ఎంపీ తన నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు చేశారు.

క్లుప్తంగా

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి నిధులివ్వండి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జిల్లాలోని చారిత్రక డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆలయ కమిటీ చైర్మన్‌ జంగం శాంతయ్య, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఆలయ కమిటీ చైర్మన్‌ శాంతయ్య, మాజీ సర్పంచ్‌లు బూస సుదర్శన్‌, ఏజీ దాస్‌, డైరెక్టర్‌ నర్సారెడ్డి, వీడీసీ సభ్యులు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ పటేల్‌ రమేశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయం వరకు సీసీ రోడ్డు, హరితవనం, భక్తుల వసతి గదులు, ఆలయం పక్కనే ఉన్న చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చు, చెరువులో బోటింగ్‌ సౌకర్యం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు చైర్మన్‌కు విన్నవించారు. స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ డైరెక్టర్‌ శరత్‌చంద్ర, శేరు లింగం, వీడీసీ సభ్యులు బూస రవి, ఆకుతోట సుమన్‌ తదితరులు పాల్గొన్నారు.

డీపీఎంల నుంచి షురూ..

- బదిలీలకు ఆప్షన్లు ఇచ్చిన సెర్ప్‌

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఐకేపీలో ఉద్యోగ బదిలీల ప్రక్రియ మొదలైంది. డీపీఎంల నుంచి బదిలీలను మొదలు పెట్టిన రాష్ట్ర సెర్ప్‌ శాఖ వారికి ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించింది. జిల్లాలో ఆరుగురు డీపీఎంలతోపాటు ఒక ఏపీడీ ఉన్నారు. వీరందరినీ బదిలీ చేసేందుకు ఆప్షన్‌ ఫారాలను ఇచ్చింది. వీటిని నింపిన డీపీఎంలు, ఏపీడీ సెర్ప్‌ శాఖకు హార్డ్‌కాపీని అందజేయగా ఆన్‌లైన్‌లో కూడా ఆప్షన్లు పెట్టుకున్నారు. రెండు, మూడు రోజుల్లో సెర్ప్‌ సీఈవో వీరికి వెబ్‌ కౌన్సెలింగ్‌ ద్వారా బదిలీలు చేపట్టనున్నారు. డీపీఎంల బదిలీలు పూర్తయిన వెంటనే ఏపీఎంలు, సీసీలకు కూడా బదిలీలకు ఆప్షన్లు ఇవ్వనున్నారు. వీరికి జిల్లా స్థాయిలోనే డీఆర్‌డీవో ఆధ్వర్యంలో కౌన్సెలింగ్‌ జరుగుతుంది.

జీజీ కాలేజీలో సీట్ల కేటాయింపు

నిజామాబాద్‌అర్బన్‌: గిరిరాజ్‌ ప్రభుత్వ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి మొదటి విడత సీట్ల కేటాయింపు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్‌ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 1,860 సీట్లకు 1,223 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. సీట్లు వచ్చిన విద్యార్థులు వ్యక్తిగత లాగిన్‌లో సెల్ఫ్‌ రిపోర్టు చేయాలని, లేకపోతే అడ్మిషన్‌ కోల్పోతారన్నారు. ఈ నెల 30 నుంచి జూన్‌ 8వ తేదీ వరకు రెండో విడత సీట్ల కోసం రిజిస్ట్రేషన్‌ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

నిజామాబాద్‌ అర్బన్‌: టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని డీఈవో అశోక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆధార్‌ కార్డు, హాల్‌ టికెట్‌ సమర్పించి ఒరిజినల్‌ ధ్రువపత్రాలు తీసుకెళ్లాలన్నారు.

ఆర్మూర్‌లో పోలీసుల తనిఖీ

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని పాత బస్టాండ్‌లో గురువారం రాత్రి ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు స్నిఫర్‌ డాగ్‌లతో తనిఖీలు చేశారు.

మాకూ.. బతకాలని ఉంటుంది

కీటకాల మనోవ్యథ

హాయ్‌ అండీ...

మేము నోరు లేని చిన్నపాటి జీవాలం ..మాకూ భూమిపై బతకాలని ఆశగా ఉంటుంది.. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మీరు సంతోషంగా ఉంటారని తెలుసు.. మీరెంత సంతోషంగా ఉంటారో మేమంత బాధలో ఉంటామని మీకు తెలుసా? కారణం వర్షాలతో మా నివాసాల్లోకి నీరు చేరడంతో రోడ్డుపైకి చేరుతాము. రోడ్డును దాటుతున్న తరుణంలో మీ వాహనాల చక్రాల కింద దాక్కున్న యముడు కన్నెర్ర జేసి కనికరం లేకుండా యమపాశాన్ని ప్రయోగిస్తున్నాడు. మిమ్మల్ని అడ్డుగా పెట్టుకొని ఆ యముడు మమ్మల్ని తన లోకానికి తీసుకెళ్తున్నాడు. ఎన్నటికైనా..అక్కడికే వెళ్లాల్సిందే. కానీ కొన్ని రోజులు మీ మాదిరిగానే మా తల్లిదండ్రులు, బంధువులు, ఆప్తులతో గడపాలని మాకూ కోరికగా ఉంటుంది. – నవీపేట



కనికరం లేకుండా ఆత్మలేని నా(తాబేలు) దేహాన్ని భుజిస్తున్న నాతోటి జీవి కాకి



విష సర్పాలమని చక్రాల కింద నలిపేశారు



బహుశా నా(తేలు)లో విషముందని చంపేశారేమో..



హమ్మయ్య.. నేను, నా(నత్త) పిల్లలు బ్రతికిపోయాం..



నడుం కాళ్లు విరిగి నేను(కప్ప) ఎలా బతకాలి..



నేనేం(బూగ) పాపం చేశానని ఈ శిక్ష విధించారు

ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలి

- సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించాలి
- పోలీసు అధికారులతో సమీక్షలో డీజీపీ జితేందర్‌



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్‌, పక్కన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ రాజేశ్‌ చంద్ర

కామారెడ్డి క్రైం: ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలని డీజీపీ జితేందర్‌ సూచించారు. గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ రాజేశ్‌ చంద్ర పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కార్యాలయ ఆవరణలో డీజీపీ మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో శాంతి భద్రతల నిర్వహణ, ప్రాధాన్యమైన కేసులు, నేరాల పరిశోధన, ప్రజలకు అందిస్తున్న సేవలను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తాము సురక్షితంగా ఉన్నామన్న భావన ప్రజల్లో కలిగేలా పోలీసింగ్‌ ఉండాలన్నారు. ప్రతి కేసులో సమర్థవంతమైన, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నప్పుడే ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించవచ్చన్నారు. సాంకేతికత ఉపయోగంలో దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ ప్రథమ స్థానంలో ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హైవే అథారిటీ, రవాణా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్‌ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించడం, బాధితులకు అండగా నిలవడం, నేరస్తులకు శిక్ష పడేలా కేసుల విచారణ జరిపించడం తదితర అంశాల్లో జిల్లా అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. సమీక్షలో మల్టీ జోన్‌–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌, నిజామాబాద్‌ సీపీ సాయి చైతన్య, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సిబ్బందికి అభినందన

కామారెడ్డి క్రైం: ఇటీవల డయల్‌ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించిన బ్లూకోల్ట్‌, పెట్రో కార్‌ పోలీసులను డీజీపీ అభినందించారు. బాన్సువాడ ఎస్సై తాజుద్దీన్‌, బాన్సువాడ కానిస్టేబుల్‌ శంకర్‌, పిట్లం కానిస్టేబుల్‌ రవిచంద్ర, పిట్లం హోంగార్డ్‌ మారుతిలను అభినందించి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందించారు.



సిబ్బందికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న డీజీపీ

పప్పు, నూనె గింజ పంటలతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయ్‌ కుమార్‌

రుద్రూర్‌ : పప్పు ధాన్యాలు, నూనె గింజ పంటల సాగుతో అధిక లాభాలను అర్జించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్‌ సూచించారు. పోతంగల్‌ మండలం హెగ్డోలిలో గురువారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి, సోయా, మొక్కజొన్న పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విధానాలను వివరించారు. ఒకే రకమైన పంట వేయడంతో భూములు చౌడు బారిపోతున్నాయని, దీని నివారణకు పంట మార్పిడి చేయాలన్నారు. తక్కువ కాల పరిమితి రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చునని తెలిపారు. వ్యవసాయ సమాచార సాధనాలపై విస్తరణ శాస్త్రవేత్త శ్వేత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి నిశిత, వెటర్నరీ డాక్టర్‌ సురేశ్‌కుమార్‌, ఏఎంసీ చైర్మన్‌ హన్మంతు, మాజీ ఎంపీపీ పుప్పాల శంకర్‌, రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకే ఎంఎస్‌పీ పెంపు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌



సుభాష్‌నగర్‌: వానాకాలం సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలపడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ఎంఎస్‌పీ పెంచిందని తెలిపారు. 2014 సంవత్సరంలో వరి మద్దతు ధర రూ.1360 ఉండగా, 2025నాటికి రూ.2369కి కేంద్ర ప్రభుత్వం పెంచిందని గుర్తుచేశారు. రైతులకు వడ్డీ రాయితీ కోసం రూ.15,642 కోట్లు విడుదల చేసిందని, 11 ఏళ్లలో ఖరీఫ్‌ పంటలకు ఎంఎస్పీ భారీగా పెంచిందని, ఎంఎస్‌పీ కోసం రూ.2.70లక్షల కోట్లు కేంద్రం కేటాయించిందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. కనీస మద్దతు ధర పెంచిన ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి జిల్లా రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

డిగ్రీలో ముగ్గురు డిబార్‌

డిచ్‌పల్లి: తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో గురువారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్‌ అయినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 14,690 మంది విద్యార్థులకు 13,397 మంది హాజరుకాగా 1,293 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్‌ నగరంలోని సీఎస్‌ఐ డిగ్రీ కాలేజీలో ఒకరు, కామారెడ్డిలోని ఆర్‌కే డిగ్రీ కాలేజీలో ఒకరు, ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఒకరు డిబార్‌ అయ్యారని తెలిపారు.

మీకు తెలుసా?

నవనాథ సిద్ధులగుట్టపై ఏకశిల స్థూపం



ఆర్మూర్‌: ఆర్మూర్‌ పట్టణానికి దక్షిణ నైరుతి భాగంలో కొన్ని కిలోమీటర్ల మేర సిద్ధుల గుట్ట విస్తరించి ఉంది. గుట్ట చుట్టూ ప్రజలు నివాసాలను ఏర్పరుచుకున్నారు. రాతియుగంలో గుట్టకు దక్షిణాన ఉన్న ప్రజలకు కనిపించేలా ఏక శిల స్థూపాన్ని నిర్మించారు. సుమారు 15 ఫీట్ల పొడవుతో ఈ స్థూపం ఉంటుంది. స్థూపంపైన నాలుగు మూలల్లో నాలుగు పిల్లర్లు ఉండి పైనుంచి కప్పు నిర్మాణం ఉంటుంది. కింది నుంచి విసిరే రూపాయి కాయిన్‌ స్థూపంపైన నాలుగు పిల్లర్ల మధ్యన నిలిస్తే మనసులోని కోరికలు నెరవేరుతాయనేది భక్తుల నమ్మకం.

చెరువు శిఖం భూమి కబ్జా



పట్టా భూమి పక్కనే ఉన్న చెరువు శిఖం భూమి

- పది ఎకరాల్లో ప్లాట్ల దందా
- కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం

నిజామాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రంలోని సారంగాపూర్‌ శివారులో చెరువు శిఖం భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ఇటీవల వెలుగు చూసింది. 10 ఎకరాల చెరువు శిఖం భూమిలో ప్లాట్ల దందా ప్రారంభించారు. నిజామాబాద్‌ – బోధన్‌ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కోట్ల రూపాయల విలువజేసే ఈ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. దీంతో శిఖం భూమి పక్కనే ఉన్న ప్రైవేటు భూమి పట్టాను చూపుతూ కొందరు కబ్జాకు యత్నిస్తున్నట్లు తెలిసింది. కాగా, గతంలో చెరువు శిఖం భూమిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా గుర్తిస్తూ బోర్డును పెట్టారు. సర్వే నంబర్‌ 231లోని సుమారు 10 ఎకరాల 8 గుంటల శిఖం భూమి చుట్టూ కందకాన్ని తవ్వారు. కానీ, ఇటీవల ఓ మాజీ కార్పొరేటర్‌ కందకాన్ని తొలగించి శిఖం స్థలంలో ప్లాట్లు చేసి అమాయకులకు విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అందులో భాగంగానే శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానిక నాయకులు కొందరు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో రాజేంద్ర కుమార్‌ రెవెన్యూ సిబ్బందితో కలిసి చెరువు శిఖం భూమిని పరిశీలించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



శిఖం భూముల్లో హద్దు రాళ్లు పాతి కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే కబ్జా చేయడం విడ్డూరం. అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలి.

– అక్బర్‌ నవాజుద్దీన్‌, సారంగాపూర్‌

రీ సర్వే చేస్తాం..



సారంగాపూర్‌లోని చెరువు శిఖం భూమి కబ్జాపై ఫిర్యాదులొచ్చాయి. కలెక్టర్‌ ఆదేశాలతో ఆ స్థలాన్ని రీసర్వే చేస్తాం. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.

– అనురుద్‌, తహసీల్దార్‌

రక్తదానంతో ప్రాణదాతలవ్వండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

డీఈవో అశోక్‌

నిజామాబాద్‌అర్బన్‌: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ పేర్కొన్నారు. నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో రక్తదాన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రెడ్‌క్రాస్‌ సొసైటీని కోరారు. పాఠశాలలో జూనియర్‌ క్రాస్‌ను బలోపేతం చేద్దామని ఉపాధ్యాయులకు సూచించారు. 40 మంది రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అర్బన్‌ మండల ఎంఈవో, కోర్స్‌ డైరెక్టర్‌ సాయిరెడ్డి, రెడ్‌క్రాస్‌ సొసైటీ చైర్మన్‌ ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్‌, కోశాధికారి కే రవీందర్‌, జేఆర్సీ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ అబపూర్‌ రవీందర్‌, మెడికల్‌ ఆఫీసర్‌ రాజేశ్‌, ప్రతినిధులు ధర్మేందర్‌, శ్రీకాంత్‌, శ్రీనివాస్‌, వెంకట్‌, శ్రీనివాస్‌, నగేశ్‌, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో కలెక్టర్‌ ఆకస్మిక తనిఖీ



సారంగాపూర్‌లోని రైస్‌మిల్లులో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ హనుమంతు

నిజామాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న అర్సపల్లి, ఖానాపూర్‌, సారంగాపూర్‌ ప్రాంతాల్లోని రైస్‌మిల్లులను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌తో కలిసి అర్సపల్లిలోని రుద్రా రైస్‌మిల్లు, ఖానాపూర్‌లోని ఎల్‌జీ ఆగ్రో ఇండస్ట్రీస్‌, వీరభద్ర రైస్‌మిల్లు, సారంగాపూర్‌లోని అనూ ఫుడ్స్‌ రైస్‌మిల్లును సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని వెంటవెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. మిల్లింగ్‌ ప్రక్రియ సైతం త్వరగా చేయాలని సూచించారు. కలెక్టర్‌ వెంట డీఎస్‌వో అరవింద్‌ రెడ్డి, సివిల్‌ సప్లైస్‌ డీఎం శ్రీకాంత్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో పలువురు మృతి

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు..

ఆర్మూర్‌టౌన్‌ : ఆర్మూర్‌ మండలంలోని మల్లారెడ్డి చెరువులో గురువారం దొండి గంగప్రసాద్‌(52) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. రోజు మాదిరిగానే ఉదయం 10 గంటలకు టీ స్టాల్‌ తీసిన గంగప్రసాద్‌.. 11 గంటలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని జన్నేపల్లి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేట మండలం మోకన్‌పల్లి గ్రామానికి చెందిన దుబ్బాక నరేశ్‌(22) మృతి చెందినట్లు ప్రొబెషనరీ ఎస్సై శైలేందర్‌ తెలిపారు. నరేశ్‌ జిల్లా కేంద్రంలోని హరిహర ప్లాస్టిక్‌ దుకాణంలో పనిచేస్తాడు. బుధవారం రోజూ వారీ పనిని ముగించుకొని బైక్‌పై మోకన్‌పల్లికి వెళుతుండగా పాండురంగ రైస్‌మిల్‌ వద్ద ఉన్న రైల్వేగేట్‌ ప్రాంతంలో కాలినడకన వెళుతున్న ఖానాపూర్‌ గ్రామానికి చెందిన రేకులపల్లి నాగభూషణంను ఢీ కొట్టాడు. ప్రమాదంలో నరేశ్‌ బైక్‌ పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నాగభూషణంకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబెషనరీ ఎస్సై తెలిపారు.

డిచ్‌పల్లిలో గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డిచ్‌పల్లి : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 60 సంవత్సరాలు) గురువారం ఉదయం మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌ కాంపౌండ్‌ వాల్‌ లోపల బుధవారం ఉదయం అపస్మారకస్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతు గురువారం ఆ వ్యక్తి మృతి చెందాడు. చామనఛాయ రంగులో ఉన్న మృతుడి ఒంటిపై గోధుమ రంగు ఫుల్‌ షర్ట్‌, లేత గోధుమ రంగు ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే డిచ్‌పల్లి సీఐ 87126 59851, ఎస్సై 87126 59852 నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

అమెరికాలో తిమ్మారెడ్డి యువకుడు అనుమానాస్పద మృతి



గోవర్ధన్‌ (ఫైల్‌)

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన గోవర్ధన్‌ (28) అనే యువకుడు గురువారం అమెరికాలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన గూల విఠల్‌ కుమారుడు గోవర్ధన్‌ నాలుగు సంవత్సరాల క్రితం అమెరికాలో ఒకాయోలో ఎంఎస్‌ చదివేందుకు వెళ్లాడు. గతేడాది నుంచి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న గోవర్ధన్‌.. బుధవారం కుటుంబసభ్యులతో మాట్లాడాడు. గురువారం గోవర్ధన్‌ మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. గోవర్ధన్‌ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహం వచ్చేందుకు నాలుగు రోజులు పట్టే అవకాశం ఉన్నదని స్థానికులు తెలిపారు.

బాలిక అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్‌లో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన బాలిక(15) అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నాందేడ్‌కు చెందిన కామ్రే పూజ తన ఐదుగురు పిల్లలను తీసుకొని నిజామాబాద్‌లోని ఫంక్షన్‌ హాల్లో పని చేసేందుకు వచ్చింది. బుధవారం రాత్రి 7 గంటలకు నాందేడ్‌ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌ రాగా రైలు దొరకకపోవడంతో భోజనం చేసి రాత్రి 11 గంటలకు పిల్లలతో కలిసి 2వ నంబర్‌ ప్లాట్‌ ఫాంపై నిద్రించారు. గురువారం ఉదయం లేచి చూసేసరికి పెద్ద కూతురు కనిపించకపోవడంతో పూజ చుట్టు పక్కల వెతికింది. ఆచూకీ లభించకపోవడంతో రైల్వే పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక ఎవరికైనా కనిపిస్తే 87126 58591 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



లక్ష్మణ్‌ (ఫైల్‌)

రెంజల్‌(బోధన్‌): మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్‌(42) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. గత శనివారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన లక్ష్మణ్‌ భార్యతో ఘర్షణ పడగా, ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చిన తల్లికి లక్ష్మణ్‌ మృతదేహం కనిపించింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని బోధన్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లి పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడిలో ఒకరిపై కేసు నమోదు

నవీపేట : మండలంలోని నాడాపూర్‌ గ్రామంలో ఇంకుడు గుంత విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మోహన్‌ రెడ్డి తెలిపారు. ప్రవీణ్‌ ఇంటి ఎదుట మురికి నీరు చేయడంతో ఇంకుడు గుంత కట్టుకోవాలని పక్కింట్లో ఉండే ఎండల రవీందర్‌ సూచించాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రవీందర్‌పై ప్రవీణ్‌ కర్రతో దాడి చేయగా చేతికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడు రవీందర్‌ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఎల్లారెడ్డి: మండలంలోని మాచాపూర్‌ శివారులో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేశ్‌ గురువారం తెలిపారు. మాచాపూర్‌ గ్రామ శివారులో పేకాట స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 7,400 నగదు, 5 సెల్‌ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని ఒకటో డివిజన్‌ ఖానాపూర్‌లో చిన్నమోహన్‌కు చెందిన పాడి గేదె గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఖానాపూర్‌ పరిధిలోని లక్ష్మీస్టోర్‌ వద్ద విద్యుత్‌ షాక్‌కు గురైందన్నారు. గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రామడుగులో చోరీ

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరామ శ్రీనివాస్‌ బుధవారం ఇంటికి తాళాలు వేసి అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి నిజామాబాద్‌ ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గమనించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న విలువైన వస్తువులు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లేగదూడల పట్టివేత

భిక్కనూరు: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న లేగదూడలను భిక్కనూరు పోలీసులు గురువారం పట్టుకున్నారు. నిజామాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీ చేశారు. వాహనంలో అనుమతి లేకుండా తరలిస్తున్న 11 మగ లేగదూడలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ మహమ్మద్‌ సమీర్‌ను విచారించగా లేగదూడలను ఆదిలాబాద్‌ జిల్లాలో కొనుగోలు చేసి సంగారెడ్డి మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పాడన్నారు. లేగ దూడలను కొనుగోలు చేసిన మహారాష్ట్రకు చెందిన వసీంతోపాటు డ్రైవర్‌ సమీర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.